కేలండర్ ఆవిష్కరణ



జియాగూడ: కార్వాన్ విశ్వకర్మ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం కేలండర్‌ను కార్వాన్ విశ్వకర్మ సేవా సంఘం ప్రతినిధులు పంచముఖ బ్రహ్మ ఆలయంలో ఆదివారం ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు నరహరిచారి, ప్రేమ్‌చారి, దేవేందర్‌చారి, అనంతచారి, నరసింహ్మ చారి, బ్రహ్మం, ముత్యాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గోల్కొండ: తెలంగాణలో బీజేవైఎం బలియమైన శక్తిగా ఎదిగిందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ అన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా ఒక సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి టి.యోగ్‌రాజ్‌సింగ్ ఆదివారం ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సెవెళ్ల మహేందర్ మాట్లాడుతూ..బీజేవైఎంలో పనిచేసే ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పని చేస్తూ పార్టీ ఆశయ సాధన కోసం పని చేస్తున్నారన్నారు. బీజేవైఎం నాయకుడు సచిన్ కామ్లెకర్ తదితరులు ఉన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21, 22 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్ తెలిపారు. 'ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణ ద్వారా స్థిర ఆర్థికాభివృద్ధి' అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారం అందిస్తుందన్నారు. ఆయన సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అనుసరించి, మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను చర్చించడానికి పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులకు ఒక వేదికగా ఈ సదస్సు నిలుస్తుందన్నారు. ఈ సదస్సుకు కన్వీనర్‌గా కె.మల్లికార్జునరావు, కో కన్వీనర్ ఎస్. ఝాన్సీరాణి వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్ఫత్ ఉన్నీసా బేగం, శిరీష, పి.వై. లలిత చైతన్య, కావ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ అప్రెంటిషిప్ మేళా


విజయనగర్‌కాలనీ: నేడు జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు సనత్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాయిడి శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిశ్రమలతో పాటు ప్రైవేట్ రంగంలోని ప్రముఖ సంస్థలు, కంపెనీలలో శిక్షణ ఇచ్చేందుకు ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ ద్వారా ఏదైన ట్రేడుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఈ అప్రెంటిషిప్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆధార్, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇతర విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో సోమవారం ఉదయం 10.30 గంటలకు నేరుగా హాజరుకావాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు విజయనగర్‌కాలనీలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సనత్‌నగర్ ఐటీఐలో నేరుగా హాజరుకావాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పీకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికయ్యింది. ఈ మేరకు ఆదివారం ఎల్బీస్టేడియంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా టి.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు గౌడ్, కోశాధికారిగా మనోజ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

వృద్ధుడి అదృశ్యం



గజానంద్ చౌదర్

జియాగూడ: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహ్మద్ అస్లాం తెలిపిన వివరాల ప్రకారం..మంగళ్‌హాట్ ప్రకాష్ టాకీస్ సమీపంలో నివసించే గజానంద్ చౌదరి (62) ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందీ మాత్రమే మాట్లాడే గజానంద్ చౌదరి బ్లూ షర్ట్ గ్రే షాట్ ధరించినట్లు తెలిపారు. అతని ఆచూకీ తెలిస్తే మంగళ్‌హాట్ పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సండే @ 65,000





కిటకిటలాడిన నుమాయిష్

అబిడ్స్: నుమాయిష్ సందర్శకులతో కిక్కిరిసింది. ఆదివారం ఒక్కరోజే 65,000 మంది సందర్శకులు వచ్చినట్లు ఎగ్జిబిషన్స్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి వెల్లడించారు. సెలవు దినాల్లో పెద్ద ఎత్తున జంట నగరాల ప్రజలే గాక ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల చెందినకు అటవీ, కార్మిక, జైలు శాఖలతో పాటు పలు శాఖలను సందర్శకుల కోసం ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు.

ఆర్‌బీఐతో పాటు పలు బ్యాంకులు తమ స్టాళ్లను ఏర్పాటు చేసి సందర్శకులకు బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్నారు. దేశంలోని పలు రాష్ట్ర చెందిన ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు.

గోషామహల్‌కు బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిని నియమించాలి



తలసానిని సత్కరిస్తున్న కోళ్ల ప్రదీప్‌రాజ్, శేఖర్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జిని నియమించాలని బేగంబజార్ డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్‌రాజ్, బీఆర్‌ఎస్ నేతలు శేఖర్, సురేష్‌తో పాటు పలువురు నాయకులు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ హయాంలోనే కోట్ల రూపాయాల అభివృద్ధి జరిగిందన్నారు. ప్రస్తుతం పార్టీ పటిష్టంగా ఉందన్నారు. నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ఇన్‌చార్జిను వెంటనే నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని సానుకూలంగా స్పందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్పీడీసీఎల్ ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. పటేల్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని పటేల్‌నగర్, లలితాబాగ్, అంబికానగర్, ఖాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. గొలిపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని గొలిపురా, మేకలమండి, సీబీటీ క్వార్టర్స్, సుల్తాన్ షాహి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఛత్రినాక విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఛత్రినాక, బోయిగూడా, శ్రీరామ్ నగర్, మగ్దుం పుర, గొలిపుర, మురాద్ మహల్, బాలాగంజ్, లాల్ దర్వాజా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

బహదూర్‌పురా పరిధిలో..

బహదూర్‌పురా ఓహెచ్, అసద్ బాబా నగర్, కిషన్‌బాగ్ తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 32/11 కేవీ లంగర్‌హౌస్ సబ్‌స్టేషన్ పరిధిలోని మిలటరీ ఆస్పత్రి, ఇందిరా నగర్, ఫ్లోర్ మిల్, లంగర్‌హౌస్ చౌరస్తా, పెన్షన్‌పుర, గొల్లబస్తీ, బాగ్దాద్ కాలనీ, అహ్మద్‌కాలనీ, కంపెనీబాగ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 32/11కేవీ మోతీమహల్ సబ్‌స్టేషన్ పరిధిలోని రేతిగల్లి, గోల్కొండ ప్రభుత్వ ఆస్పత్రి, బాలాన్సర్, బడాబజార్, నయాఖిల్లా, జీన్సీ బజార్, తాకత్‌బౌలి, రాఘవమ్మ కంచ, హీరాఖానా 1, 2, మోతీమహల్, ఖాజీగల్లీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



నాంపల్లి: ఆకాంక్ష ఫౌండేషన్ సీఎస్‌ఏ లా సెట్ అకాడమీ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ పోస్టర్‌ను ఆదివారం విశ్రాంత న్యాయమూర్తి, ఎస్‌సీబీసీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య తన స్వగృహంలో ఆవిష్కరించారు. సీఎస్‌ఏ లాసెట్ కోచింగ్ డైరెక్టర్ మహ్మద్ బషీర్ అహ్మద్ అధ్యక్షతన పోస్టర్‌ను ఆవిష్కరించిన జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడారు. సీఎస్‌ఏ లాసెట్ అకాడమీ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ లాసెట్ అకాడమీ వ్యవస్థాపకుడు సయీద్ ఉద్దీన్, ఇతర బోర్డు డైరెక్టర్లను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. సీఎస్‌ఏ లాసెట్ కోచింగ్ డైరెక్టర్ మహ్మద్ బషీర్ మాట్లాడుతూ..లాసెట్ వృత్తిని కోరుకునేవారికి ఈ ఉచిత ఆన్‌లైన్ లాసెట్ కోచింగ్‌ను ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు వెంటనే 79897 87990లో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జోరుగా నిర్వహించారు. ఎగ్జిబిషన్ పెండాలు వద్ద కళాకారుల కూచిపూడి నృత్యాలు అందర్ని ఆకట్టుకున్నాయి. ప్రముఖ నృత్య కళాకారిణి గురువు కె.రాధిక ఆధ్వర్యంలో కళాకారులు తమదైన శైలిలో కూచిపూడి పలు విభాగాల నృత్యాలు చేసి అందరిని మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ముభైర్ అహ్మద్, పెద్ద ఎత్తున సందర్శకులు పాల్గొన్నారు.



కళాకారులతో కన్వీనర్ ముభైర్

మలబార్ షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి

గోల్కొండ: టోలిచౌకీలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నూతన షోరూమ్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ..నాణ్యమైన గోల్డ్ అండ్ డైమండ్స్ ఆభరణాలు వినియోగదారులకు అందించడం వల్లే తమకు ఆదరణ పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫరాజుద్దీన్ తదితరులున్నారు.

నిర్లక్ష్యానికి.. నిదర్శనం

లంగర్‌హౌస్: రోజురోజుకూ పారిశుద్ధ్య అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు విసిగిపోతున్నారు. తూతూ మంత్రంగా విధులు నిర్వహించి చేతులు దులిపేసుకోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. గతంలో బాపూసమాధి వద్దకు వెళ్లే దారి ముళ్ల చెట్లు, చెత్త, పొదలతో మూసుకుపోయింది. ప్రస్తుతం చెత్తతో పాటు రాంలీలా మైదానంలో రావణాసురుడి కాలిన ఎత్తైన బొమ్మ, అమ్మవారి బోనాల తొట్టెల చూస్తే వారి నిర్లక్ష్యం ఇట్టే అర్థమవుతుంది. రాంలీలా మైదానంలో దసరా ఉత్సవాలు నిర్వహించిన సమయంలో రావణాసురుని దహనం జరిగింది. ఇది జరిగి మూడు నెలలు గడుస్తున్నా ఆ దహన వ్యర్థాలను ఇప్పటికీ అక్కడి నుంచి తొలగించలేదు. అలాగే బోనాల అనంతరం అమ్మవారి తొట్టెలలు ఇక్కడ నిమజ్జనం చేయడం ఆనవాయితీ. ఐదు నెలలు పూర్తయినా ఇప్పటికీ రాంలీలా మైదానంలో పారవేసిన అమ్మవారి తొట్టెల ఇక్కడ దర్శనమిస్తుండటం విశేషం. పారిశుద్ధ్య అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలని ప్రజలు మండిపడుతున్నారు.



డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

యాకుత్‌పురా: నూతన పైపులైన్ పనులతో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్నామని తలాబ్ చంచలం డివిజన్ కార్పొరేటర్ సమీనా బేగం అన్నారు. డివిజన్‌లోని తలాబ్‌కట్టా, భవానీనగర్, చాచా గ్యారేజ్, సిద్దిఖీనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న డ్రైనేజీ మరమ్మతు పనులను ఆదివారం ఆమె స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గతంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైపులైన్ల వ్యవస్థ శిథిలావస్థకు చేరుకోవడంతో నిత్యం డ్రైనేజీ పొంగుపొర్లేదని ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పనులు చేపట్టామన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సమీనా బేగం

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు



మజ్లిస్ నాయకులు, కార్పొరేటర్‌తో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో టోలిచౌకీ, గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్ మజ్లిస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల కోసం నిధులు తేవడంలో ఎప్పుడు కృషి చేస్తుంటానని వచ్చిన నిధులతో వెంట వెంటనే అభివృద్ధి పనులు చేయిస్తూ ముందుకు సాగుతున్నానన్నారు. పారిశుద్ధ్య పనులు కుంటుపడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీని కోసం తాను వివిధ డివిజన్ల పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమై వారిని మరింత శ్రద్ధతో విధులు నిర్వహించాలని ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, మిర్జా ఎక్బాల్ అహ్మద్, సయ్యద్ రఫత్‌హుస్సేన్ ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



జగన్మోహన్

యాకుత్‌పురా: బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని బీజేపీ డబీర్‌పురా డివిజన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కేసరి జగన్మోహన్ అన్నారు. యాకుత్‌పురా బ్రహ్మణ్‌వాడిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు డివిజన్ ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించిన పార్టీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ కేంద్రా ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు.

రేపు చలో 'నుమాయిష్ దోబారా'

గోల్కొండ: సీనియర్ సిటిజన్స్, అనాథాశ్రమంలో ఉంటున్న వయో వృద్ధుల కోసం తాము 'నుమాయిష్ దోబారా'కార్యక్రమాన్ని చేపడుతున్నామని దోబారా ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ మతీన్ అన్సారీ తెలిపారు. సీనియర్ సిటిజన్స్, హోమ్ ఫర్ ఎజ్డ్‌లో ఉండే వారితో పాటు నడవలేని వారి కోసం ఈ నెల 21న చలో 'నుమాయిష్ దోబారా'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఇందులో సుమారు వంద మంది పాల్గొంటున్నారని, వీరందరికీ తాము దోబారా సంస్థ నుంచి నుమాయిష్ సందర్శించడానికి రవాణా, వీల్ చైర్స్ ఉచితంగా అందిస్తున్నామని, స్నాక్స్, డ్రింక్స్ కూడా అందిస్తామన్నారు. వీరికి సహాయంగా ఎన్‌సీసీ వలంటీర్స్‌తోపాటు వివిధ పాఠశాలలకు చెందిన వలంటీర్స్ కూడా ఉంటారన్నారు. ఈ నెల 21న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీల్ చైర్స్‌లో చలో 'నుమాయిష్ దోబారా'నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

స్పా కేంద్రంపై దాడి

లంగర్‌హౌస్: నిబంధనలు పాటించని స్పా కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..బాలానగర్‌లో నివాసముండే బిలాల్ లక్ష్మీనగర్ పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 68 వద్ద స్పా మసాజ్ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా మగవారికి ఆడవారితో, ఆడవాళ్లకు మగవారితో మసాజ్ చేయిస్తున్నాడు. దీనికి తోడు వివరాల సేకరణ లేకుండా కనీసం సీసీ కెమరాలు కూడా ఏర్పాటు చేయకుండా డోర్లు మూసి మసాజ్ చేయిస్తున్నాడు. దీంతో శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు, లంగర్‌హౌస్ పోలీసులు కలిసి దాడి చేశారు. ఇద్దరు యువతులతో పాటు, ఇద్దరు మగవారిని, నిర్వాహకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

కులవృత్తులను కాపాడుకోవాలి

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో కార్పొరేటర్ వ్యవస్థ దూకుడుతనం ముందు అన్ని చేతివృత్తులు కనుమరుగవుతున్నాయని శాసన మండలి సభ్యులు మధుసూదనాచారి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాత్యసంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేతికుల వృత్తుల జాతీయులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తులను ఆదుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాత్యసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రచారిలతో పాటు వివిధ కులాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశాన వాటికలో అక్రమ వసూళ్లు



మహమ్మద్ సలావుద్దీన్ లోది

చార్మినార్: ముస్లిం శ్మశానవాటికలో దహన సంస్కారాలు ఉచితంగా నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ కొంతమంది నిర్వాహకులు పేదలను దోచుకుంటున్నారని చార్మినార్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది ఆరోపించారు. కొంతమంది అక్రమంగా రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం శాస్త్రిపురానికి చెందిన మహ్మద్ సిరాజ్ మృతి చెందడంతో ఆయన భౌతికాయాన్ని జంగ్‌పూల్‌లోని దర్గా హజ్రత్ అలీ షా సాబ్ ఖాద్రి ముస్లిం శ్మశాన వాటికలో దహన సంస్కారానికి రాగా అక్కడి నిర్వాహకురాలు అధిక డబ్బులు డిమాండ్ చేసి అడ్డుకున్నారు. రూ.18 వేలు చెల్లించాలంటూ పట్టుపట్టడంతో విషయాన్ని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ హకీంకు ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అన్ని శ్మశాన వాటికల్లో ఉచితంగా దహన సంస్కారాలే కాకుండా పేదలకు రూ.5 వేలు అందజేశామన్నారు. ఈ విషయంలో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీతో పాటు ఎమ్మెల్సీ ఆమేర్ అలీ ఖాన్ పట్టించుకోవాలన్నారు. అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న ముస్లిం జంగ్ ముస్లిం శ్మశాన వాటిక మేనేజింగ్ కమిటీ సభ్యురాలు ఆసియాపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తాము కొద్దిసేపు శ్మశాన వాటిక వద్ద నిరసన తెలిపామన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి అన్ని శ్మశాన వాటికల వద్ద సైన్ బోర్డులను ఏర్పాటు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీస్ స్టేషన్ల పేర్లు ఉర్దూలో ఉండేలా చూడాలి



సీవీ ఆనంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసద్ అలీ, మహ్మద్ ఫైజల్

నాంపల్లి: నగరంలోని పోలీస్‌స్టేషన్ల పేర్లు ఉర్దూ భాషలో ఉండేలా చొరవ చూపాలని బజ్ మే కక్షాన్ లిటరరీ అసోసియేషన్ సలహాదారు, న్యాయవాది మహ్మద్ అసద్ అలీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నగరంలోని అనేక పోలీస్‌స్టేషన్ల బోర్డులపై పేర్లు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. కొన్నింటి బోర్డుల్లో ఉర్దూలో పేర్లు ఉన్నప్పటికీ అవి తప్పుల తడకగా ఉన్నట్లు వివరించారు. తప్పులను వెంటనే సవరించాలని, లేనిచోట కొత్తగా ఉర్దూలో చేర్చాలని సూచించారు. న్యాయవాది మహ్మద్ ఫైజల్, బజ్ మే కక్షాన్ లిటరరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తస్కీల్ రజాఖీ, ఉపాధ్యక్షుడు మహ్మద్ నాజమ్ అలీ పాల్గొన్నారు.

అబిడ్స్‌లో సినీ తారల సందడి



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సినీ తారలు మదివాడ తేజస్వీ, చొక్కారపు స్రవంతి ఆదివారం అబిడ్స్‌లో సందడి చేశారు. అబిడ్స్ జీపీఓ చౌరస్తా వద్ద ఉన్న కాలి వస్త్ర షోరూమ్‌లో నూతన వస్త్రాల పెళ్లి, పండుగల కలెక్షన్‌ను వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం నటీ తేజస్వీ మాట్లాడుతూ..తనకు షాంపింగ్ ఎంతో ఇష్టమని తెలిపారు. త్వరలో సినిమా, వెబ్ సిరీస్‌లతో ప్రేక్షకులను అలరించబోతున్నట్లు వెల్లడించారు. సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే ధరలతో నూతన వస్త్రాలను అందించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మిస్ ఇండియా తెలంగాణ–2024 ప్రకృతి కంభం, మిస్సెస్ ఇండియా తెలంగాణ–2023 ఊర్మిళ చౌహాన్, వస్త్ర షోరూమ్ ప్రతినిధులు పాల్గొన్నారు.